నేడు ఈసీ ప్రెస్ కాన్ఫరెన్స్

న్యూఢిల్లీ, జూన్ 2: లోక్‌సభ ఎన్నికలు ముగిశాయి. ఇక అభ్యర్థుల భవిష్యత్తును వెల్లడించే ఫలితాలు మంగళవారం వెలువడనున్నాయి. ఈ క్రమంలో భారత ఎన్నికల సంఘం ఓట్ల లెక్కింపునకు ఒక రోజు ముందు సోమవారం మీడియా సమావేశం నిర్వహించనుంది. ఎన్నికలు ముగిసిన తర్వాత ఇలా ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టడం బహుశా ఎన్నికల సంఘానికి ఇదే తొలిసారి. 2019 ఎన్నికల వరకు ప్రతి విడత ఎన్నిక ముగిసిన తర్వాత దానికి సంబంధించిన వివరాలను డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్లు మీడియాకు క్లుప్తంగా వివరించేవారు. అయితే ఇప్పుడు ఆ సంప్రదాయానికి వీడ్కోలు పలికి తొలిసారిగా ఎన్నికలు ముగిసిన తర్వాత ఎన్నికల కమిషన్ ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నది.

అరుణాచల్ మళ్లీ బీజేపీదే

46 అసెంబ్లీ స్థానాల్లో కమలం పార్టీ విజయం

మూడోసారి ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధం

కేవలం ఒక్క స్థానానికే పరిమితమైన కాంగ్రెస్

మరోసారి ముఖ్యమంత్రిగా పెమా ఖండూ?

అరుణాచల్ సీఎం పెమా ఖండూకు స్వీట్ తినిపిస్తున్న బీజేపీ నేతలు

ఈటానగర్/ముంబై, జూన్ 2: అరుణాచల్ ప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో అధికార బీజేపీ ఘన విజయం సాధించింది. ఆదివారం విడుదలైన ఎన్నికల ఫలితాల్లో మొత్తం 60 నియోజకవర్గాలకుగాను 46 స్థానాల్లో ఆ పార్టీ విజయం సాధించింది. పోలింగ్‌కు ముందే 10 స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు ఏకగ్రీవ ఎన్నికతో విజయం సాధించారు. ఎన్నికలు జరిగిన 50 నియోజకవర్గాల్లో 36 స్థానాల్లో కమలం పార్టీ గెలిచిందని కౌంటింగ్ తర్వాత ఈసీ వెల్లడించింది. కాంగ్రెస్ పార్టీ ఘోరంగా కేవలం ఒక్క స్థానానికి పరిమితమైంది. నేషనల్ పీపుల్స్ పార్టీ(ఎన్‌పీపీ)-5, నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ)-3, పీపుల్స్ పార్టీ ఆఫ్ అరుణాచల్(పీపీఏ)-2 స్థానాల చొప్పున గెలుచుకోగా, స్వతంత్రులు మూడు చోట్ల విజయం సాధించారు. దీంతో రాష్ట్ర అసెంబ్లీలో సంపూర్ణ మెజార్టీతో బీజేపీ మూడోసారి అధికారం చేపట్టనున్నది. తాజా అసెంబ్లీ ఫలితాల నేపథ్యంలో కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు అనుకూలంగా గవర్నర్ కేటీ పర్నాయక్ రాష్ట్ర అసెంబ్లీని రద్దు చేశారు. సీఎం పెమాఖండూ, మంత్రివర్గం రాజీనామాను ఆయన ఆమోదించారు.

ప్రముఖ బీజేపీ నేతల ఓటమి

బీజేపీ మెజార్టీ స్థానాల్లో విజయం సాధించినప్పటికీ, ఆ పార్టీలోని కొందరు ప్రముఖ నేతలు ఎన్నికల్లో ఓడిపోయారు. యఛులి నియోజకవర్గంలో విద్యా శాఖ మంత్రి తబ తేదిర్ ఎన్సీపీ(అజిత్ పవార్) అభ్యర్థి చేతిలో ఓడిపోయారు. మరో ప్రముఖ నేత, సీఎం పెమాఖండూకు సన్నిహితుడిగా భావించే న్యామర్ కర్బాక్ లిరోమోబా స్థానం నుంచి పరాజయం పాలయ్యారు. మూడుసార్లు ఎమ్మెల్యే కుంసి, రెండుసార్లు ఎమ్మెల్యే కైలింగ్ మొయోంగ్ కూడా ఈసారి ఓటమి చవిచూశారు. మరోవైపు పెమా ఖండూతో వ్యక్తిగత శత్రుత్వం ఉండే మాజీ హోంమంత్రి కుమార్ వాయ్ కాంగ్రెస్ నుంచి గెలిచిన ఒకే ఒక్క అభ్యర్థిగా అసెంబ్లీలో అడుగుపెట్టనున్నారు. 2019లో ఓడిన ఎన్‌పీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గతంలో నాలుగు సార్లు ఎమ్మెల్యేగా చేసిన తాంగ్‌వాంగ్ వాంగమ్ ఈసారి ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిపై ఘన విజయం సాధించారు.

జంపింగ్‌లతో సీఎం స్థానం పదిలం

రాష్ట్రంలో ఏకగ్రీవమైన 10 మంది బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థుల్లో సీఎం పెమా ఖండూ కూడా ఉన్నారు. ఈయనే రాష్ట్ర సీఎంగా మరోసారి బాధ్యతలు చేపట్టే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది. క్రీడా ప్రేమికుడు, సంగీత ప్రియుడు అయిన పెమాఖండూ 2016లో రాష్ట్రంలో రాష్ట్రపతి పాలనకు దారి తీసిన రాజ్యాంగ సంక్షోభం తర్వాత కీలక నేతగా ఎదిగారు. తన వ్యూహాత్మక రాజకీయ ఎత్తుగడలతో ఈశాన్య రాష్ట్రంలో బీజేపీని తొలిసారిగా అధికారంలోకి తీసుకొచ్చారు. కాంగ్రెస్ నుంచి పీపీఏలో చేరిన ఆయన.. ఆ తర్వాత 2016లో మెజార్టీ పీపీఏ ఎమ్మెల్యేలతో బీజేపీ తీర్థం పుచ్చుకొని, సీఎంగా కొనసాగారు.

2024 ఎన్నికల ఫలితాలు

మొత్తం స్థానాలు	60
(మ్యాజిక్ ఫిగర్	31)
బీజేపీ	46
ఎన్‌పీపీ	5
ఎన్సీపీ	3
పీపీఏ	2
కాంగ్రెస్	1
స్వతంత్రులు	3

- **2019 ఎన్నికల ఫలితాలు**

బీజేపీ- 41,జేడీయూ-7, ఎన్‌పీపీ-5,కాంగ్రెస్-4,పీపీఏ-1, స్వతంత్రులు-2

ప్రజలకు ధన్యవాదాలు: మోదీ

అరుణాచల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై ప్రధాని మోదీ స్పందించారు. బీజేపీపై విశ్వాసం ఉంచినందుకు ఆయన రాష్ట్ర ప్రజలకు కృతజ్ఞతలు చెప్పారు. మరోవైపు అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ మూడు స్థానాల్లో జయకేతనం ఎగురవేయడంపై ఆ పార్టీ నేత ప్రఫుల్ పటేల్ హర్షం వ్యక్తం చేశారు.

మసకబారిన కాంగ్రెస్ ప్రభ

రాష్ట్రంలో ఒకప్పుడు ఒక వెలుగు వెలిగిన కాంగ్రెస్ పార్టీ ప్రభ పూర్తిగా మసకబారింది. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో నాలుగు స్థానాలు గెలిచిన ఆ పార్టీ.. ఈసారి మరింత దిగజారి కేవలం ఒక్క స్థానంలోనే విజయం సాధించి ఘోర పరాభవం మూటగట్టుకొన్నది. అరుణాచల్‌లో తన ఉనికి కాపాడుకొనేందుకు హస్తం పార్టీ నానాపాట్లు పడుతున్నది. పోటీ చేసేందుకు ఆ పార్టీకి కనీసం అభ్యర్థులే లేని పరిస్థితి నెలకొన్నది. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ కేవలం 19 స్థానాల్లో మాత్రమే అభ్యర్థులను నిలబెట్టింది.

అవి మోదీ మీడియా పోల్

రాహుల్ విమర్శ

న్యూఢిల్లీ, జూన్ 2: దేశంలోని పలు సంస్థలు శనివారం వెలువరించిన ఎగ్జిట్ పోల్స్ 'బోగస్' అని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. వీటిని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ 'మోదీ మీడియా పోల్'గా అభివర్ణించారు. వీటిని ఎగ్జిట్ పోల్‌గా పిలవకూడదు. మోదీ మీడియా పోల్‌గా వ్యవహరించాలన్నారు. మరోవైపు కొత్త ప్రభుత్వం 100 రోజుల అజెండాపై మోదీ ఆదివారం విస్తృతంగా సమీక్షా సమావేశాలు నిర్వహించడాన్ని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తప్పుబట్టారు. ఎగ్జిట్ పోల్స్‌లో కొన్ని సంస్థలైతే ఆ రాష్ట్రంలో ఉన్న వాస్తవ సీట్ల సంఖ్య కంటే ఎక్కువ కట్టబెట్టాయని అన్నారు. ఎగ్జిట్ పోల్స్‌ను ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ నకిలీవిగా అభివర్ణించగా, అవి వాస్తవాలకు దూరంగా ఉన్నాయని సమాజ్‌వాదీ అధినేత అఖిలేశ్ యాదవ్ అన్నారు.

'ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లను ప్రకటించాలి'

న్యూఢిల్లీ, జూన్ 2: లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ సమయంలో మార్గదర్శకాలను కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని ఇండియా కూటమి నేతలు కోరారు. ఆదివారం ఆ కూటమి నేతల బృందం ఈసీని కలిసింది. నిబంధనల ప్రకారం ఈవీఎంలలో ఓట్ల లెక్కింపునకు ముందే పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కించి, వాటి ఫలితాలు ప్రకటించాలని ఈసీని కోరినట్టు కాంగ్రెస్ నేత అభిషేక్ సింఘ్వి తెలిపారు. ఈవీఎంలు, కంట్రోల్ యూనిట్లను సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉన్న మార్గాల్లోనే తరలించాలని, కంట్రోల్ యూనిట్లపై ప్రస్తుత తేదీ, సమయాన్ని కచ్చితంగా పరిశీలించాలని కోరినట్టు సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చెప్పారు ఏ పోలింగ్ కేంద్రంలో ఎన్ని ఓట్లు పోలయ్యాయయో చెప్పే 17సీ ఫామ్‌ను కౌంటింగ్ సమయంలో పోల్చి చూసుకోవాలని కూటమి నేతలు తమ ఏజెంట్లకు సూచించారు.

సిక్కింలో ఎస్‌కేఎం ప్రభంజనం

- **అసెంబ్లీ ఎన్నికల్లో రెండోసారి జయకేతనం**
- **32 స్థానాలకు గానూ 31 సీట్లు కైవసం**
- **ఒకే స్థానానికి పరిమితమైన ప్రతిపక్ష ఎస్‌డీఎఫ్**
- **రెండుచోట్లా ఓడిపోయిన మాజీ సీఎం చామ్లింగ్**
- **బీజేపీకి ఘోర పరాభవం.. ఓడిన రాష్ట్ర అధ్యక్షుడు**

గెలిచిన అనంతరం విలేకరులతో మాట్లాడుతున్న సీఎం తమాంగ్

గ్యాంగ్‌టక్, జూన్ 2: హిమాలయ రాష్ట్రం సిక్కిం అసెంబ్లీ ఎన్నికల్లో అధికార సిక్కిం క్రాంతికారి మోర్చా(ఎస్‌కేఎం) ఘన విజయం నమోదు చేసింది. 32 స్థానాలకు గానూ 31 స్థానాలు కైవసం చేసుకొని ప్రభంజనం సృష్టించింది. ఆదివారం వెలువడిన ఎన్నికల ఫలితాల్లో ప్రతిపక్ష సిక్కిం డెమోక్రటిక్ ఫ్రంట్(ఎస్‌డీఎఫ్) కేవలం ఒకే ఒక్క స్థానానికి పరిమితమైంది. స్వయంగా ఆ పార్టీ అధ్యక్షుడు, ఐదు సార్లు ముఖ్యమంత్రిగా పని చేసిన పవన్ కుమార్ చామ్లింగ్ రెండుచోట్ల ఓటమి చెందారు. ఇక జాతీయ పార్టీలు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఒక్క స్థానాన్ని కూడా గెలుచుకోలేకపోయాయి. ఐదేండ్ల తన పాలన ద్వారా ప్రజా మోదం పొందిన ప్రస్తుత సీఎం ప్రేమ్ సింగ్ తమాంగ్ మరోసారి అధికారం చేపట్టనున్నారు.

ఎస్‌కేఎం క్లీన్‌స్వీప్!

సిక్కిం అసెంబ్లీ ఎన్నికల్లో ప్రత్యర్థి పార్టీలపై సిక్కిం క్రాంతికారి మోర్చా స్పష్టమైన ఆధిక్యాన్ని కనబర్చింది. 2019 ఎన్నికల్లో 25 ఏండ్ల ఎస్‌డీఎఫ్ పాలనకు తెరదించి ఎస్‌కేఎం మొదటిసారి అధికారంలోకి వచ్చింది. తాజా ఎన్నికల్లో ఆ పార్టీ 58.38 శాతం ఓట్లను సాధించి ఏకంగా 31 సీట్లు గెలుచుకొని దాదాపుగా క్లీన్‌స్వీప్ చేసేసింది. ఇక, 2019 ఎన్నికల్లో 15 సీట్లు సాధించి స్వల్ప తేడాతో అధికారం కోల్పోయిన సిక్కిం డెమోక్రటిక్ ఫ్రంట్ ఈసారి దారుణ పరాజయాన్ని మూటగట్టుకున్నది. ఆ పార్టీ దాదాపు 20 శాతం ఓట్లను కోల్పోయి 27.37 శాతం ఓట్లతో ఒకే ఒక్క స్థానానికి పరిమితమైంది. శ్యారీ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎస్‌డీఎఫ్ అభ్యర్థి టెంజింగ్ నోర్బు లమ్తా మాత్రమే అసెంబ్లీలో అడుగుపెట్టనున్నారు.

2024 ఎన్నికల ఫలితాలు (మొత్తం స్థానాలు -32)

పార్టీ	గెలిచిన స్థానాలు
సిక్కిం క్రాంతికారి మోర్చా	31
సిక్కిం డెమొక్రటిక్ ఫ్రంట్	1
బీజేపీ	0
కాంగ్రెస్	0

- **2019లో ఎన్నికల ఫలితాలు**

సిక్కిం క్రాంతికారి మోర్చా-17
సిక్కిం డెమొక్రటిక్ ఫ్రంట్-15
బీజేపీ-0,కాంగ్రెస్-0

గురువును మించిన శిష్యుడు తమాంగ్

మరోసారి అధికారం చేపట్టనున్న 56 ఏండ్ల ప్రేమ్ సింగ్ తమాంగ్(పీఎస్ గోలే) సిక్కిం ప్రజల్లో మంచి ఆదరణను పొందారు. రాజకీయాల్లోకి రాకముందు మూడేండ్లు ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేసిన ప్రేమ్ సింగ్.. సిక్కిం డెమొక్రటిక్ ఫ్రంట్ నుంచే తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. 1994 నుంచి 2009 వరకు ఆయన మంత్రిగా పని చేశారు. ఎస్‌డీఎఫ్‌లో ఆయన చామ్లింగ్‌కు శిష్యుడిగా కొనసాగారు. 2009 తర్వాత ఆయనకు పవన్ కుమార్ చామ్లింగ్‌తో విభేదాలు మొదలయ్యాయి. దీంతో ఎస్‌డీఎఫ్ నుంచి బయటకు వచ్చి 2013లో సొంతంగా సిక్కిం క్రాంతికారి మోర్చా పార్టీని స్థాపించారు. 2019 ఎన్నికల నాటికి 17 సీట్లు సాధించి 25 ఏండ్ల ఎస్‌డీఎఫ్ పాలనకు ముగింపు పలికి రికార్డు సృష్టించారు

బీజేపీ, కాంగ్రెస్ కుదేలు

సిక్కింలో జాతీయ పార్టీలు బీజేపీ, కాంగ్రెస్‌కు మరోసారి ఘోర పరాభవం ఎదురైంది. బీజేపీ 31 స్థానాల్లో పోటీ చేసి అన్నింటా ఓడిపోయింది. బీజేపీ ఈ ఎన్నికల్లో రాష్ట్రమంతా కలిపి కేవలం 19,956 ఓట్లు మాత్రమే సాధించింది. కాంగ్రెస్ మరింత దారుణంగా ఓడింది. ఆ పార్టీ 12 స్థానాల్లో పోటీ చేయగా అన్నింటా కలిపి కేవలం 1,228 ఓట్ల, అంటే 0.32 శాతం ఓట్లు మాత్రమే సాధించింది. నోటాకు వచ్చిన 0.99 శాతం ఓట్ల కంటే కాంగ్రెస్‌కు తక్కువ వచ్చాయి. స్థానిక సిటిజన్ యాక్షన్ పార్టీ-సిక్కిం సైతం 30 స్థానాల్లో పోటీ చేసినా ఎక్కడా ప్రభావం చూపలేకపోయింది.

చామ్లింగ్‌కు ఎదురు దెబ్బలు

ఈ ఎన్నికల్లో సిక్కిం డెమొక్రటిక్ ఫ్రంట్ అధ్యక్షుడు పవన్ కుమార్ చామ్లింగ్‌కు ఘోర పరాభవం ఎదురైంది. దేశంలోనే అత్యధిక కాలం ముఖ్యమంత్రిగా పని చేసిన చామ్లింగ్ ఈ ఎన్నికల్లో రెండు స్థానాల్లో పోటీ చేసి ఓడిపోయారు. పాక్లోక్ కామ్రూంగ్ నియోజకవర్గంలో చామ్లింగ్‌పై ఎస్‌కేఎం అభ్యర్థి భోజ్‌రాజ్ రాయ్ 3,063 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. నామ్చేబంగ్‌లో ఎస్‌కేఎం అభ్యర్థి రాజబసంత్ చేతిలో 2,256 ఓట్ల తేడాతో చామ్లింగ్ ఓటమి చవిచూశారు. ఆయన గతంలో తన నాయకత్వంలో ఎస్‌డీఎఫ్‌ను ఐదుసార్లు అధికారపీఠంపై కూర్చోబెట్టారు.

భైచంగ్ భూటియాకు తప్పని ఓటమి

భారత ఫుట్‌బాల్ దిగ్గజం భైచంగ్ భూటియాకు ఈ ఎన్నికల్లోనూ ఓటమి తప్పలేదు. బర్సంగ్ నుంచి ఆయన సిక్కిం డెమోక్రటిక్ ఫ్రంట్ తరపున పోటీ చేసి ఓడారు.

జైరాం రమేశ్‌కు ఈసీ నోటీస్

న్యూఢిల్లీ: కేంద్ర హోం మంత్రి అమిత్ షా జిల్లాల కలెక్టర్లకు ఫోన్లు చేస్తున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ చేసిన ఆరోపణలపై ఎన్నికల కమిషన్ (ఈసీ) స్పందించింది. జైరాం శనివారం ఇచ్చిన ట్వీట్‌ను పరిగణనలోకి తీసుకుని ఈ చర్యను చేపట్టింది. ''పదవి నుంచి వైదొలగుతున్న హోం మంత్రి జిల్లాల డీఎంలు/కలెక్టర్లకు ఫోన్లు చేస్తున్నారు. ఇప్పటి వరకు 150 మందికి ఫోన్ చేశారు. ఇది బాహాటంగా బెదిరించడమే. దీన్ని బట్టి బీజేపీ ఎంత నైరాశ్యంలో ఉందో వెల్లడవుతున్నది'' అని జైరాం ట్వీట్ చేశారు. అమిత్ షా జిల్లాల కలెక్టర్లకు ఫోన్లు చేసినట్లు తెలిపే సమాచారాన్ని ఆదివారం సాయంత్రం 7 గంటలలోగా తమకు సమర్పించాలని జైరాంను ఈసీ ఆదేశించింది. ఈ సమాచారం ఇస్తే, తగిన చర్యలు తీసుకుంటామని తెలిపింది.

మద్యం తాగి డ్రైవింగ్ చేశా!

పుణె కేసులో బాలుడి ఒప్పుకోలు

పుణె: పుణెలో విచక్షణారహితంగా పోర్షే కారును నడిపి, ఇద్దరి మృతికి కారకుడైనట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బాలుడు నేరాన్ని అంగీకరించాడని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. తాను డ్రైవింగ్ చేస్తున్న సమయంలో పూటుగా మద్యం సేవించినట్లు అతడు తెలిపాడు. జరిగిన సంఘటనలు తనకు పూర్తిగా గుర్తు లేవని వెల్లడించాడు. మరోవైపు బాలుడి తల్లిదండ్రులకు ఈ నెల 5 వరకు పోలీసు కస్టడీకి పుణే కోర్టు ఆదేశించింది. ఈ ప్రమాదానికి సంబంధించిన మూడు కేసుల దర్యాప్తుకు 100 మంది పోలీసులను నియమించారు.

యూట్యూబ్‌లో మిస్టర్ బీస్ట్ రికార్డు

న్యూఢిల్లీ: జిమ్మీ డొనాల్డ్‌సన్ అలియాస్ మిస్టర్‌బీస్ట్ యూట్యూబ్‌లో అత్యధిక సబ్ స్క్రైబర్లు కలిగిన యూట్యూబర్‌గా రికార్డు సృష్టించారు. మ్యూజిక్ కంపెనీ టీ-సిరీస్‌ను అధిగమించి ఆయన చానల్ ఈ ఘనత సాధించింది. అమెరికాకు చెందిన డొనాల్డ్‌సన్ ఆదివారం ఓ ట్వీట్‌లో ఈ వివరాలను వెల్లడించారు. తాజా గణాంకాల ప్రకారం మిస్టర్ బీస్ట్‌కు 26,67,07,995 మంది సబ్‌స్క్రైబర్లు, టీ-సిరీస్‌కు 26,67,06,387 మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు.

తీహార్ జైలులో లొంగిపోయిన కేజ్రీవాల్

- **21 రోజుల్లో ఒక్క నిమిషం కూడా వృథా చేయలేదు**
- **దేశాన్ని రక్షించడం కోసం ప్రచారం చేశా: ఢిల్లీ సీఎం**

జైలుకు సరెండర్ అయ్యేముందు రాజ్‌ఘాట్‌కు వెళ్తున్న సీఎం కేజ్రీవాల్, ఆప్ నేతలు

న్యూఢిల్లీ, జూన్ 2: తన మధ్యంతర బెయిల్ గడువు ముగియడంతో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆదివారం తీహార్ జైలులో లొంగిపోయారు. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో అరెస్టై తీహార్ జైలులో ఉన్న కేజ్రీవాల్ ఎన్నికల ప్రచారం చేసుకోవడానికి అనుమతినిస్తూ సుప్రీం కోర్టు మధ్యంతర బెయిల్ ఇవ్వడంతో ఆయన లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో విస్తృతంగా పాల్గొన్నారు. బెయిల్ గడువు జూన్ 2కు ముగియడంతో ఆయన తీహార్ జైలుకు వచ్చారు. లొంగిపోవడానికి ముందు ఆయన గాంధీ స్మృతివనం రాజ్‌ఘాట్‌లో నివాళి అర్పించారు. కన్నాట్ ప్లేస్‌లోని హనుమాన్ దేవాలయంలో ప్రార్థనలు చేశారు. 'నేను జైలుకు తిరిగి వెళ్తున్నాను.. అయితే అది అవినీతి చేసినందుకు కాదు.. నియంతృత్వంపై గళం ఎత్తినందుకు' అని అన్నారు. 'సుప్రీం కోర్టు నాకు 21 రోజులు బెయిల్ ఇచ్చింది. నిజంగా అవి మరచిపోలేని రోజులు. ఒక్క నిమిషం కూడా వాటిని వృథా చేయలేదు. దేశాన్ని రక్షించడం కోసం ప్రచారం నిర్వహించా. ఆప్ నాకు ముఖ్యం కాదు, నా మొదటి ప్రాధాన్యత దేశానికే, తర్వాతే ఆప్' అని ఆయన పేర్కొన్నారు. కేజ్రీవాల్ భార్య సునీత కేజ్రీవాల్, ఆప్ నేతలు ఆయన వెంట వచ్చారు.

'పనికిమాలిన చర్చల జోలికి వెళ్లొద్దు'

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల ఎగ్జిట్ పోల్స్‌పై ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ స్పందించారు. వాటిపై ప్రజలకు కొన్ని సూచనలు చేశారు. ''మరోసారి ఎన్నికలు, రాజకీయాల ప్రస్తావన వస్తే, ఖాళీగా కూర్చున్న బూటకపు పాత్రికేయులు, పెద్ద నోరు పెట్టుకుని మాట్లాడే రాజకీయ నేతలు, సామాజిక మాధ్యమాల నిపుణుల మని చెప్పుకునే స్వయం ప్రకటిత విశ్లేషకుల పనికిమాలిన చర్చలు, విశ్లేషణల జోలికి వెళ్లి, మీ విలువైన సమయాన్ని వృథా చేసుకోకండి'' అని శనివారం ట్వీట్ చేశారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి 300కుపైగా స్థానాలు వస్తాయని ప్రశాంత్ మొదటి నుంచి చెప్తున్న సంగతి తెలిసిందే.

భారత ఎంబసీ ఆఫీసుల లాక్‌డౌన్‌కు పిలుపు

'40 ఏండ్ల ఆపరేషన్ బ్లూ స్టార్'కు ఎస్‌ఎఫ్‌జే నిరసన

టొరంటో, జూన్ 2: పంజాబ్‌లోని స్వర్ణ దేవాలయంపై ఆపరేషన్ బ్లూ స్టార్ జరిగి 40 ఏండ్లు పూర్తయిన సందర్భంగా కెనడాలోని భారత రాయబార కార్యాలయాల లాక్‌డౌన్‌కు సిక్కు వేర్పాటువాదులు పిలుపునిచ్చారు. ఒట్టావాలోని భారత హైకమిషన్, వాంకోవర్, టొరంటోలోని దౌత్య కార్యాయాలను ఈ నెల 6న లాక్‌డౌన్ చేయాలని సిక్స్ ఫర్ జస్టిస్ (ఎస్‌ఎఫ్‌జే) జనరల్ కౌన్సెల్ గురుపత్వంత్ పన్నూన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఇప్పటికే ముందస్తు నోటీసు ఇచ్చినట్టు పేర్కొన్నారు. ఖలిస్థానీ వేర్పాటువాదాన్ని అణచి వేసేందుకు 1984 జూన్ ఆరో తేదీన అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయం కంప్లెక్స్‌పై భారత ప్రభుత్వం ఆపరేషన్ బ్లూస్టార్ అనే పేరుతో సైనిక చర్య నిర్వహించి నట్టు ఆయన గుర్తుచేశారు. అలాగే, అదే ఏడాది నవంబర్‌లో అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ హత్య అనంతరం దేశవ్యాప్తంగా జరిగిన సిక్కువ్యతిరేక అల్లర్లకు కూడా 40 ఏండ్లు నిండాయని తెలిపారు. నాటి సిక్కు మారణహోమాన్ని అధికారికంగా గుర్తించాలని న్యూ డెమెక్రటిక్ పార్టీ (ఎన్‌డీపీ) కోరింది.

నాకేం తెలీదు.. నేను నిర్దోషిని!

విచారణకు సహకరించని ప్రజ్వల్

బెంగళూరు, జూన్ 2: లైంగిక దాడి ఆరోపణల కేసులో అరెస్టయిన హసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ తనను విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందానికి సహకరించడం లేదని తెలిసింది. గత రెండు రోజులుగా సిట్ అధికారులకు ప్రజ్వల్ నుంచి పూర్తి సహాయ నిరాకరణ ఎదురవుతున్నది. 'నాకేం తెలీదు.. నేను నిర్దోషిని.. నన్ను కుట్ర చేసి ఈ కేసులో ఇరికించారు' అన్న సమాధానమే ఆయన నుంచి వస్తున్నట్టు తెలిసింది. దీంతో ఆయన్ను స్పాట్ విచారణ జరపాలని సిట్ యోచిస్తున్నది. లోక్‌సభ ఎన్నికల లెక్కింపు ప్రారంభమయ్యే మంగళవారానికి ముందే దీనిని పూర్తి చేయాలని యోచిస్తున్నది. మరోవైపు సెక్స్ వీడియోలు తీశారని భావిస్తున్న ప్రజ్వల్ యాపిల్ ఫోన్‌లోని డాటాను యాక్సిస్ చేయడానికి సిట్ అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు. ఐ క్లౌడ్‌లో నిక్షిప్తమైన ఆ డాటాను యాక్సిస్ చేస్తే, అసభ్య వీడియోలు ఆయన ఫోన్ నుంచి తీసారా లేదా అన్న విషయం నిర్ధారణ అవుతుందని సిట్ భావిస్తుంది.

ముందస్తు బెయిల్ కోసం హైకోర్టుకు ప్రజ్వల్ తల్లి!

ఇదే కేసులో విచారణకు గైర్హాజరైన ప్రజ్వల్ తల్లి భవాని ముందస్తు బెయిల్ కోసం సోమవారం హైకోర్టును ఆశ్రయిస్తారని తెలుస్తున్నది. కాగా.. ప్రజ్వల్ తండ్రి హెచ్‌డీ రేవణ్ణ ఇప్పటికే కిడ్నాప్ కేసులో అరెస్టయ్యి బెయిల్‌పై బయటకు వచ్చారు. అయితే ఆయన బెయిల్‌ను రద్దు చేయాలంటూ సిట్ హైకోర్టును ఆశ్రయించడంతో అదివారం లేదా సోమవారం ఈ అంశం విచారణకు వచ్చే అవకాశం ఉంది.

వేలానికి డయానా వ్యక్తిగత లేఖలు

లండన్: బ్రిటన్ మాజీ యువరాణి డయానాకు సంబంధించిన కొన్ని వస్తువులను ఈ నెల 27న వేలం వేయనున్నారు. ఇందులో ఆమె తన వ్యక్తిగత సహాయకుడికి రాసిన లేఖలు కూడా ఉన్నాయి. డయానా తన వ్యక్తిగత విషయాలు, తన జీవితంలోని మధుర క్షణాలు, పలు అనుభవాలను లేఖల్లో పంచుకొన్నారని స్థానిక మీడియా వెల్లడించింది. డయానాకు 1981లో ప్రిన్స్ చార్లెస్‌తో వివాహం అయింది. 1996లో ఆమె విడాకులు తీసుకొన్నారు. మరుసటి ఏడాది 36 ఏండ్ల వయసులో డయానా కారు ప్రమాదంలో మరణించారు.

కువైట్ కొత్త క్రౌన్ ప్రిన్స్‌గా షేక్ సభా

కువైట్ సిటీ: కువైట్ మాజీ ప్రధాని షేక్ సభా ఖాలెద్ అల్-హమద్ అల్ సభాను కొత్త క్రౌన్స్ ప్రిన్స్‌గా ప్రకటిస్తూ ఆ దేశ ఎమిర్(దేశాధిపతి) ప్రకటన చేసినట్టు స్థానిక మీడియా పేర్కొన్నది. 71 ఏండ్ల షేక్ 2011 నుంచి 2019 వరకు గల్ఫ్ విదేశాంగ మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత 2022 వరకు ప్రధానిగా ఉన్నారు. 83 ఏండ్ల కువైట్ ఎమిర్ షేక్ మెషాల్ అల్-అహ్మద్ అల్ సభా సింహాసనాన్ని అధిష్ఠించి ఆరు నెలలు అయింది. ఇటీవల ఎన్నికలు జరగ్గా ఆరు వారాల్లోనే పార్లమెంటును రద్దు చేశారు. ఇప్పుడు కొత్త క్రౌన్ ప్రిన్స్‌ను ప్రకటించారు.

చంద్రుడి దక్షిణ ధృవంపై దిగిన 'చాంగే-6'

బీజింగ్, జూన్ 2: చంద్రుడికి ఆవలివైపు వ్యోమనౌకను పంపి అంతరిక్ష ప్రయోగాల్లో చైనా సరికొత్త చరిత్ర సృష్టించింది. చైనాకు చెందిన లూనార్ ల్యాండర్ చాంగే-6 చంద్రుడి దక్షిణ ధృవంపై విజయవంతంగా ల్యాండ్ అయ్యిందని చైనా నేషనల్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ (సీఎన్‌ఎస్‌ఏ) ఆదివారం ప్రకటించింది. బీజింగ్ కాలమానం ప్రకారం.. ఆదివారం ఉదయం 6.23 గంటలకు అయిట్కిన్ బేసిన్ పేరిట ఉన్న ప్రదేశంలో లూనార్ ల్యాండర్ సురక్షితంగా నేలను తాకినట్టు సీఎన్‌ఎస్‌ఏ తెలిపింది. ఇందుకోసం అధునాతన టెక్నాలజీతో కూడిన చాంగే-6ను ఉపయోగించింది. ఈ మిషన్ ద్వారా అక్కడి వాతావరణంతోపాటు శిలలు, ధూళిలోని పదార్థాల గురించి కొత్త విషయాలు వెలుగులోకి వస్తాయని సైంటిస్టులు భావిస్తున్నారు.

ఇదేమి వాతావరణం?!

- **కొన్ని చోట్ల వరదలు.. మరోవైపు ఎండలు**
- **అదృశ్యమైపోతున్న వసంత రుతువు!**
- **ఎల్‌నినో, నగరీకరణే ప్రధాన కారణాలు**
- **ఆరోగ్యం, ఆర్థిక వ్యవస్థపై పెను ప్రభావం**

న్యూఢిల్లీ: ఈ ఏడాది ప్రారంభం నుంచి దేశవ్యాప్తంగా నెలకొన్న విచిత్రమైన వాతావరణ పరిస్థితులు ప్రజలను భయాందోళనలకు గురి చేస్తున్నాయి. ప్రస్తుతం ఉత్తరాదిలో తారెత్తించే వడగాడ్పులు అనేక మందిని బలి తీసుకున్